ఫైనల్‌కు అంపైర్లు వీళ్లే

అహ్మదాబాద్: వన్డే ప్రంపచకప్ ఫైనల్‌కు అంపైర్లు ఖరారయ్యారు. ఆదివారం భారత్, ఆస్ట్రేలియా మధ్య అహ్మదాబాద్‌లోని ప్రపంచలోనే అతిపెద్దదైన క్రికెట్ మైదానంలో జరుగనున్న తుదిపోరుకు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బొర్గ్ ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. జోయల్ విల్సన్ థర్డ్ అంపైర్ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. క్రిస్ గాఫనీ ఫోర్త్ అంపైర్‌గా వ్యవహరించనున్నట్లు ఐసీసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

భారత్ అదుర్స్

ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ

కువైట్ సిటీ: ఫిఫా ప్రపంచకప్(2026) రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. గురువారం అర్ధరాత్రి ముగిసిన మ్యాచ్‌లో భారత్ 1-0తో కువైట్‌పై అద్భుత విజయం సాధించింది. తొలి అర్ధ భాగం ఎలాంటి గోల్ లేకుండా ముగియగా, ద్వితీయార్ధం ఆఖర్లో మన్వీర్‌సింగ్(75ని) సూపర్ గోల్‌తో జట్టుకు గోల్ అందించాడు. లాల్‌జువాల నుంచి పాస్ అందుకున్న మన్వీర్..ప్రత్యర్థి డిఫెండర్లను కంగుతినిపిస్తూ గోల్‌గా మలిచాడు. టీమ్‌ఇండియా ఈ నెల 21న భువనేశ్వర్‌లో ఏషియన్ చాంపియన్స్ ఖతార్‌తో తలపడుతుంది. గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు మూడో రౌండ్‌లోకి ప్రవేశిస్తాయి. ఖతార్, కువైట్, అఫ్గానిస్థాన్‌తో కలిసి భారత్..గ్రూపు-ఏ లో కొనసాగుతున్నది.

నేటి నుంచి లెజెండ్స్ లీగ్

న్యూఢిల్లీ: క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్(ఎల్ఎల్‌సీ) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి రాంచీ వేదికగా టోర్నీ మొదలవుతున్నది. దిగ్గజ క్రికెటర్లు మునాఫ్ పటేల్, ప్రవీణ్ తాంబే, హషీమ్ ఆమ్లా, అంబ్రూ లీపస్, రామన్ రహేజ్ శుక్రవారం ట్రోఫీని ఆవిష్కరించారు. డిసెంబర్‌ర 9వ తేదీ వరకు 22 రోజుల పాటు జరిగే లీగ్‌లో మొత్తం 19 మ్యాచ్‌లు జరుగనున్నాయి. గతేడాది ఫైనలిస్టులు బిల్వారా కింగ్స్, ఇండియా క్యాపిటల్స్ మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది.

పాక్ చీఫ్ సెలెక్టర్‌గా రియాజ్

లాహోర్: వన్డే ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శనతో లీగ్ దశలోనే నిష్క్రమించిన పాకిస్థాన్.. ఇప్పుడు బోర్డు ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నది. జట్టు ప్రదర్శనతో పాటు విరుద్ధ ప్రయోజనాల అంశం తెరపైకి రావడంతో.. చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ తప్పుకోగా.. ఇప్పుడు ఆ స్థానాన్ని వహాబ్ రియాజ్‌తో భర్తీ చేసింది. జాతీయ జట్టు తరపున 27 టెస్టులు, 91 వన్డేలు, 36 టీ20లు ఆడిన 38 ఏండ్ల వహాబ్ రియాజ్.. ఆస్ట్రేలియా పర్యటనకు పాక్ జట్టును ఎంపిక చేయనున్నాడు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పాక్ క్రికెట్ మరింత ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తానని వహాబ్ పేర్కొన్నాడు.

సెమీస్‌లో బోపన్న జోడీ

న్యూఢిల్లీ: భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్న ఏటీపీ ఫైనల్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఇటలీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ దుమ్మురేపింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 6-4, 7-6 (7/5)తో వెస్లీ-నీల్ ద్వయంపై విజయం సాధించింది. దాదాపు గంటన్నర పాటు సాగిన పోరులో బోపన్న జంట వరుస సెట్లలో ప్రత్యర్థి పని పట్టింది.

పన్నెండో ప్లేయర్

ఒక అభిమాని కోణంలో

ద్వైపాక్షిక సిరీస్‌లు, ఇంటాబయట వరుస విజయాలు సాధించే భారత్.. నాకౌట్ మ్యాచ్ అనేసరికి మాత్రం ముందే ఆందోళన పడటం పరిపాటిగా మారింది. గత రెండు ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌లోనూ ఓటమి పాలైన టీమ్‌ఇండియా.. ఈ సారి ఆ విఘ్నాన్ని దాటి తుదిపోరుకు చేరింది. మరి దాదాపు అదే జట్టుతో బరిలోకి దిగిన భారత్.. ఈసారి సంపూర్ణ ఆధిపత్యం కనబర్చడం వెనుక ఉన్న ప్రధాన కారణమేంటో తెలుసా?

కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడి ప్రధాన పాత్ర పోషిస్తుందనేది అందరికీ తెలిసిందే. కాగా.. ఈసారి మనవాళ్లు దాన్ని ఏమాత్రం దరిచేరనివ్వడం లేదు. జట్టులో మార్పుల్లేవు, కూర్పులో ఇబ్బందుల్లేవు. ముఖ్యంగా ఆటగాళ్ల మధ్య చక్కటి సమన్వయం కనిపిస్తున్నది. దీనికి తోడు సొంతగడ్డపై ఆడుతుండటంతో.. మైదానంలోకి దిగేది పదకొండు మందే అయినా.. అభిమానుల ప్రోత్సాహం రూపంలో వారికి అదనంగా పన్నెండో ప్లేయర్ ప్రయోజనం చేకూరుతున్నది. ఇదే జోష్‌లో మనవాళ్లు మూడోసారి జగజ్జేతగా నిలిస్తే.. ఆ పన్నెండో ప్లేయర్ కంటే ఎక్కువ సంతోషించే వాళ్లు మరొకరు ఉండరు!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రపంచకప్ ప్రారంభమైనప్పటి నుంచి భారత జట్టు ఎదురు లేకుండా సాగుతున్నది. లీగ్ దశలో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన రోహిత్ సేన.. సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. భారత క్రికెట్ జట్టు మైదానంలోకి దిగుతుందంటే చాలు.. అది ఏ రాష్ట్రమైనా, ఏ నగరమైనా స్టాండ్స్ నిండిపోవడం పక్కా. అదే ప్రపంచకప్ అనేసరికి ఆ ప్రభావం ఇంకాస్త ఎక్కువుంటుందని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. మెగాటోర్నీలో భాగంగా గత నెల 8న చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి పోరు నుంచి ఆదివారం అదే ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్‌లో జరుగనున్న తుది పోరు వరకు టీమ్‌ఇండియా ఆడిన ప్రతీ మ్యాచ్‌కు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మైదానంలో మనవాళ్లు మంచి ప్రదర్శన చేస్తున్న సమయంలో దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ ఉత్సాహాన్ని వెయ్యి రెట్లు పెంచుతున్న ఫ్యాన్స్.. భారత జట్టుకు ప్రధాన బలం. స్టాండ్స్‌లో దేశభక్తి గీతాలు పాడటం.. 'జీతేగా భయ్ జీతేగా.. ఇండియా జీతేగా' వంటి నినాదాలతో హోరెత్తించడాన్ని దాటి ఈ ప్రపంచకప్‌లో అభిమానుల సందడి రెట్టింపైంది. సాధారణంగా ఫ్యాన్స్ కేకలను పెద్దగా పట్టించుకోని టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఈసారి అభిమానుల అల్లరికి చలించింది. ఆరో ప్రత్యామ్నయ బౌలర్ లేకపోవడంతో అవసరమైతే కోహ్లీతో ఓ రెండు ఓవర్లు వేయించాలని మేనేజ్‌మెంట్ అనుకునే లోపే.. స్టాండ్స్ నుంచి అభిమానులు 'కోహ్లీ కో బౌలింగ్ దో' అంటూ లయబద్ధంగా మైదానంలో మోత మోగించారు. ఈ దెబ్బకు చివరి లీగ్ మ్యాచ్‌లో కోహ్లీ బౌలింగ్ చేయడంతో పాటు ఓ వికెట్ కూడా ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఆ తర్వాత ఎప్పుడూ బంతి పట్టని శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ కూడా బౌలింగ్ చేయగా.. చివరగా అభిమానులు రోహిత్ బౌలింగ్ చేయాలని అరుపులతో స్టేడియాన్ని హోరెత్తించడంతో హిట్‌మ్యాన్ కూడా తన బౌలింగ్ నైపుణ్యం ప్రదర్శించాల్సి వచ్చింది. మైదానంలో ఆడుతున్నది పదకొండు మందే అయినా.. ప్రేక్షకుల ప్రోత్సాహం రూపంలో ఓ అదృశ్య హస్తం ఎప్పుడూ టీమ్‌ఇండియా వెన్నంటే ఉంటుందనేందుకు ఇంతకుమించిన నిదర్శనం అవసరం లేదు. లీగ్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్ తీసుకున్నా.. సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో పోరును చూసినా.. మైదానం మొత్తం నీలి రంగు పులుముకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరగనున్న మెగా పోరుకు సౌండ్ బాక్స్‌లు బద్దలు కావడం ఖాయమే!

చేదు అనుభవం!

నాణానికి బొమ్మా బొరుసు ఉన్నట్లే.. భారత అభిమానులకు ప్రేమను పంచడంతో పాటు.. తీవ్రంగా స్పందించే అలవాటు కూడా ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో శ్రీలంకతో జరిగిన 1996 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో అభిమానులు రచ్చ లేపారు. లంక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైనా.. ఛేదనలో భారత్ తడబడింది. సచిన్ టెండూల్కర్ ఒక్కడే అర్ధశతకంతో రాణించగా.. మిగిలిన వాళ్లంతా ఘోరంగా విఫలమయ్యారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఫ్యాన్స్.. మ్యాచ్ ముగియక ముందే మైదానంలోకి నీళ్ల సీసాలు, నట్టులు, బోల్టులు విసిరి నానా హంగామా సృష్టించారు. కాసేపు బ్రేక్ ఇచ్చి తిరిగి మ్యాచ్ ప్రారంభిస్తే.. ఈ సారి ఏకంగా స్టాండ్స్‌లో సీట్లకు నిప్పు పెట్టారు. దీంతో లంకను విజేతగా ప్రకటించాల్సి వచ్చింది.

ఫైనల్ బ్లాక్‌బస్టర్

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగే ప్రపంచకప్ ఫైనల్ పోరు అభిమానులకు పసందైన విందు అందించనుంది. వింగ్ కమాండర్ సిద్ధేశ్ కార్తీక్ సారథ్యంలో సూర్యకిరణ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఒళ్లు జల్దరించే విన్యాసాలు చేయనున్నాయి. తొమ్మిది విమానాలు పది నిమిషాల పాటు స్టేడియంపై చక్కర్లు కొడుతాయి. ఇన్నింగ్స్ విరామ సమయంలో ఇప్పటి వరకు ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్లను బీసీసీఐ ఘనంగా సన్మానించనుంది. వీరి కోసం ప్రత్యేకంగా బ్లేజర్లను డిజైన్ చేశారు. మ్యూజిక్ కంపోజర్ ప్రీతమ్ ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమాలు ఫ్యాన్స్‌ను మరో లోకంలోకి తీసుకెళ్లనున్నాయి.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.